క్లుప్తంగా

పరుగు పోటీల్లో డిగ్రీ విద్యార్థికి పతకాలు



విద్యార్థి శంకర్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సీహెచ్ శంకర్ ఈ నెల 13, 14 తేదీల్లో రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ రన్నింగ్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడని ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు తెలిపారు. ఈ పోటీల్లో 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు, 400 మీటర్ల పరుగులో రజత పతకం సాధించి ఈ నెల 26 నుంచి 30 తేదీల్లో భువనేశ్వర్‌లోని కిస్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియన్ యూనివర్సిటీస్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడని చెప్పారు. శంకర్‌ను బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, కె.రమేష్, ఎం విజయ్ కుమార్, ఎస్ పరమేశ, ఎం కృష్ణ చైతన్య, టీవీఎస్ పద్మావతి, పీఆర్ కావ్య శ్రీ తదితరులు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

పెదపాడు : ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సత్వర సేవలు అందించాలని ఎంపీపీ బత్తుల రత్నకుమారి అన్నారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల పనితీరును, ప్రగతిని ఆయాశాఖల అధికారులు వివరించారు. పీఆర్ ఏఈ మురళీ మాట్లాడుతూ మండలంలో పలు అభివృద్ధి పనులకు రూ.329 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. పలు శాఖల ప్రగతిని అధికారులు వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ అమీల్ జామా, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టరు లావేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాలకు నూతన కమిటీ

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలకు నూతన అభివృద్ధి కమిటీ నియమించారు. ప్రెసిడెంట్‌గా పూజారి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా కొండేటి హనుమంతు, కార్యదర్శిగా ముప్పాళ్ల గోపాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ఏనుగు అచ్చారావు, సభ్యులుగా సింహాద్రి సతీష్, బజారు గణేష్, కేబుల్ శ్రీను నియమితులయ్యారు. ఈ కమిటీని బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ నత్తానియేలు, లెక్చరర్లు సత్కరించారు.



స్టేషన్ ఇన్‌గేట్ ఎదురుగా సిద్ధమైన ప్లాట్ ఫామ్



ప్లాట్ ఫామ్ వర్కు చేస్తున్న దృశ్యం

ఏలూరు రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- రూ.21.10 కోట్లతో అభివృద్ధి
- ప్రయాణికుల హర్షం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ఒక్కటైన ఏలూరు రైల్వేస్టేషన్ కొత్త హంగులను సంతరించుకుంటోంది. ఈ స్టేషన్ అభివృద్ధికి అమృత్ భారత్ స్టేషన్ పథకంలో రూ.21.10 కోట్ల నిధులు కేటాయించారు. నాలుగు నెలల క్రితం చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఈ స్టేషన్ మీదుగా నిత్యం 61 రైలు సర్వీసులు నడుస్తున్నాయి. ఈ స్టేషన్ నుంచి నిత్యం ఆరు వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఏలూరు స్టేషన్ భౌగోళికంగా ఇటు మెట్ట, అటు డెల్టా ప్రాంతాలకు కీలక కేంద్రంగా ఉంది. ఇక్కడి నుంచే ఆక్వా, వరి, ఉద్యాన, వాణిజ్య పంటల ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. ఏలూరులో వందే భారత్ లాంటి రైలుకు హాల్ట్ ఉంది. ప్యాసింజర్ రైళ్లను కూడా పునరుద్ధరిస్తే మరింత సౌకర్యవంతంగా ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు.



ఏలూరు రైల్వేస్టేషన్ ప్రవేశ మార్గం

అదనపు ఆదాయం



ఏలూరు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రజలు, వ్యాపారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి. ఈ స్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు.

– నాగం శివ, డీయూఆర్‌సీసీ మాజీ సభ్యుడు, ఏలూరు

మారనున్న రూపురేఖలు



అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఏలూరు స్టేషన్‌ను ఎంపిక చేశారు. దీని అభివృద్ధికి రూ.21.10 కోట్లు నిధులు కేటాయించారు. స్టేషన్ ముఖ ద్వారం, ఫ్లాట్ ఫారంల సర్వే పూర్తయింది. అభివృద్ధి పనులు పూర్తయితే ఏలూరు స్టేషన్ రూపురేఖలు మారిపోనున్నాయి.

– ఎస్‌పీ రమేష్, రైల్వే స్టేషన్ మేనేజర్, ఏలూరు

కల్పించే సౌకర్యాలివీ..

- ఏలూరు రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం అభివృద్ధి.
- విశ్రాంతి గదుల నిర్మాణం.
- ప్రయాణికులకు అనువుగా ఉండే సమాచార సూచికలు వృద్ధి.
- ప్లాట్ ఫామ్ పొడిగింపు
- టాయిలెట్ల నిర్మాణం
- తాగు నీటి పైపుల ఏర్పాటు
- సిబ్బంది భవన నిర్మాణం



తుది దశకు చేరిన సిబ్బంది భవనం



సిద్ధమవుతున్న టాయిలెట్స్, తాగునీటి పైపులు

సుస్థిర అభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లక్ష్మి

ఏలూరు రూరల్ : సుస్థిర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎల్‌డీఓ లక్ష్మి అన్నారు. ఏలూరు రూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు విడతలగా నాలుగు రోజుల పాటు పంచాయతీ, సచివాలయ, సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో డ్వాక్రా సంఘాలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో పాటు సేవా సంఘాల ప్రతినిధులతో కలిసి మహిళల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏపీఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో నిలకడైన జీవనాధారం కల్పిస్తే పేదరికం నుంచి బయటపడతారన్నారు. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణ, పునర్జీవంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ వి.శ్రీలత పర్యవేక్షణలో ఉద్యోగులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సెమీ క్రిస్మస్



సెమీ క్రిస్మస్‌లో పాల్గొన్న చిన్నారులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఫస్ట్ సెక్టార్ లంకపేట అంగన్‌వాడీ కేంద్రంలో సెమీ క్రిస్మస్‌ను బుధవారం వేడుకగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రాజెక్ట్ సీడీపీఓ ఎ.పద్మావతి మాట్లాడుతూ పిల్లల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల దుస్తుల్లో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సెక్టార్ వన్ సూపర్‌వైజర్ బి.మంగ, అంగన్‌వాడీలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

వస్తు కొనుగోలులో అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న కట్టా సత్యనారాయణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : విద్యార్థి స్థాయి నుంచి వస్తు కొనుగోలు వ్యవహారాల్లో అవగాహన కలిగి ఉండాలని, నష్టపోతే వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేసి వస్తు సేవల ధరలు తిరిగి పొందవచ్చని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్స్ అసోసియేషన్ (సెడ్కాస్) కన్వీనర్, సీనియర్ న్యాయవాది కట్టా సత్యనారాయణ అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా వినియోగదారుల హక్కులు బాధ్యతలు, వినియోగదారుల చట్టం -2019పై కొవ్వలి వినియోగదారుల సేవామండలి ఆధ్వర్యంలో బుధవారం ఏలూరులోని ఓ కళాశాలలో ప్రిన్సిపాల్ వంగ వెంకటేశ్వరరావు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ తెలివైన కొనుగోలు పద్ధతులు పాటించాలని, వస్తువు మన్నిక, వినియోగం, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యావరణానికి హాని చేసే ప్యాకింగ్‌లను తిరస్కరించాలని, గ్యాస్ విద్యుత్, నీరు లాంటి సహజ వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సెడ్కాస్ కో కన్వీనర్, సీనియర్ న్యాయవాది సీఏపీఎస్ రామానుజాచార్యులు మాట్లాడుతూ వస్తు సేవలు కొనేముందు తెలివిగా వ్యవహరించకపోతే డబ్బు, కాలం వృథా అవడంతోపాటు అనారోగ్యం బారిన పడతామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కోఆర్డినేటర్ సునీల్ సాగర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు నకారా సేవలు చిరస్మరణీయం



సన్మాన గ్రహీతలతో అసోసియేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : పెన్షనర్ల ఆశాజ్యోతి, సేవా మూర్తి ధరమ్ స్వరూప్ నకారా సేవలు చిరస్మరణీయమని అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ జి.సత్యనారాయణ అన్నారు. రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాల్‌లో పెన్షనర్స్ డే కార్యక్రమం యూనిట్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ పెన్షనర్లకు ట్రెజరీ ద్వారా సమస్యలుంటే తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, ఆర్‌సీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పెన్షన్ అనేది ఎవరి దయాభిక్ష కాదని, ఉద్యోగి ప్రాథమిక హక్కని అన్నారు. అధ్యాపకులుగా విశేష సేవలు అందించిన సీనియర్ సభ్యులు ఎం సంపదరావు, వై.రాజారాం, ఎస్ వెంకటేశ్వరావు, వి.వెంకటేశ్వరావు, కె.రాణి, ఎం రమా సత్యవతిలను ఘనంగా సత్కరించారు. తొలుత డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు పి.సుబ్బలక్ష్మి, కోశాధికారి పి.ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎస్‌సీ డేనియల్ పలువురు విశ్రాంత అధ్యాపకులు పాల్గొనగా ఎ.వీరభద్రరావు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

గ్రామాభివృద్ధికి ముందుకు రావాలి



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: ప్రజా ప్రతినిధులు, దాతలు ముందుకొచ్చి సహాయం అందిస్తే గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తాయని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు తుమ్మూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. మల్లుకుంటలో బుధవారం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మల్లుకుంటలో సర్పంచ్ తుమ్మూరి మాధవీలత కేటాయించిన పంచాయతీ స్థలంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ గాది రాజేంద్రప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.3 లక్షలతో షెడ్డును నిర్మించగా, మోండలీజ్ కంపెనీ, ఆప్కో సంస్థలు రూ.4 లక్షలు విలువ గల ఆర్‌ఓ ప్లాంట్ మిషనరీని సమకూర్చాయి. 20 లీటర్ల వాటర్‌ను రూ.5కే అందించనున్నట్లు వాటర్ కమిటీ తెలిపింది.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	50-56	బీన్సచిక్కుడు	90
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	44
బెండకాయలు	44	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24-30	కంద	60
కాకర కాయలు	28-34	బీట్‌రూట్	60
బీరకాయలు	44	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	60	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	32	అల్లం	70
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	38	చుక్కకూర	10
ఉల్లిపాయలు	50	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07
దోసకాయలు	30-36	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్



సెమీక్రిస్మస్ వేడుకలో మాట్లాడుతున్న పాస్టర్ జీవన్‌కుమార్

దెందులూరు: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని పాస్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవన్ కుమార్ అన్నారు. బుధవారం వేగవరంలోని హేలాపురి ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో ప్రిన్సిపాల్ లావణ్య, ఏఓ కరుణానిధి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్‌ను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకును కట్ చేసి విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

బాదంపూడిలో..

ఉంగుటూరు: యునైటెడ్ పాస్టర్ల అసోషియన్ ఆధ్వర్యంలో బాదంపూడిలో బుధవారం సెమీ క్రిస్మస్ ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లకు కూటమి నాయకులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి

దెందులూరు: దెందులూరు – అలుగులగూడెం రైల్వే ట్రాక్ వద్ద నిర్మించిన అండర్‌పాస్‌లో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అండర్‌పాస్ నిర్మించిన నాటి నుంచి నేటి వరకు నీరు తొలగించడానికి పూర్తిస్థాయిలో రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పాదచారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ నీటిలోనే పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, రైతులు, పాదచారులు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తున్నారు. కనీసం విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని వారంతా కోరుతున్నారు.

విద్యార్థి ఆరోగ్యంపై విచారణ

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో జరిగిన కొట్లాటలో గాయపడిన విద్యార్థిని బుధవారం ఎంఈఓ కె.అన్నమ్మ పరామర్శించారు. జరిగిన ఘటనపై ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులను వేర్వేరుగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రులకు గీజర్ల వితరణ



భీమడోలు ఆసుపత్రిలో గ్లీజర్లను వైద్యులకు అందించిన ఎంపీడీఓ

భీమడోలు: మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతంతో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు శ్రీసాయి స్వచ్ఛంద సేవా సంస్థ పేరిట చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు పలువురికి ఆదర్శనీయమని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, పూళ్ల వసతి గృహానికి రెండేసి చొప్పున శ్రీసాయి స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయంతో రూ.20వేల విలువ గల నాలుగు వాటర్ గ్లీజర్లను ఉచితంగా అందజేసారు. ఈ సందర్భంగా సేవా సంస్థ ఏర్పాటై రెండేళ్లు పూర్తయినందున ఇన్ పేషెంట్లకు పండ్లు పంపిణీ చేసారు. సంస్థ నిర్వాహకులు జి.మోహన్, గుంటూరు శ్రీనివాసరావు, గుగ్గులోతు కృష్ణ, కేఎస్ఎస్ ప్రకాశరావు, హెచ్‌ఎం గారపాటి ప్రకాశరావు మాట్లాడుతూ 70 మంది సభ్యులు గల సంస్థలోని ప్రతి ఉద్యోగి నెల జీతంలో కొంత నగదును అందించడం ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కరరావు మాట్లాడుతూ సంస్థలోని ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్థిక సాయాన్ని అందించడం చాలా సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీలత, ఆపర్ణ, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

గోదావరి కాలువలో గుర్రపుడెక్క తొలగింపు

భీమడోలు: గోదావరి కాలువలో ఉన్నగుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులను జలవనరుల అధికారులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. గుండుగొలను సెక్షన్ పరిధిలోని కాలువలో వెంబడి ఉన్న వంతెనల వద్ద దట్టంగా పేరుకుపోయిన తూడులను కూలీలు, యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. ఈనెల 17వ తేదీ మంగళవారం నీటి ప్రవాహానికి అడ్డంకులు అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించారు. తూడు తొలగింపు పనులను వేగవంతం చేసారు. గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడంతో సాగునీరు శివారు ప్రాంతాలకు చేరడం లేదు. దీనితో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనితో గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ అధికారులు కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. జేసీబీ యంత్రాలతో పాటు కూలీలకు ఆ పనులు చేపడుతున్నారు. ప్రధానంగా గుండుగొలను సెక్షన్ కార్యాలయం సమీపంలోని బెయిలీ వంతెన వద్ద తూడు, గుర్రపు డెక్కలను తొలగిస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన మినీ లారీ

గణపవరం: బ్రేకుల ఫెయిల్ కావడంతో ఒక మినీ లారీ అదుపు తప్పి ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపడింది. లారీ ఎదురుగా ఉన్న చికెన్ షాపులోకి దూసుకుపోయింది. అక్కడ నిలిపి ఉంచిన రెండు మోటార్ సైకిళ్లు లారీ కింద పడి నలిగిపోయాయి. ఆ సమయంలో అక్కడ జనం ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. తాడేపల్లిగూడెం నుంచి గణపవరం వైపు వస్తున్న మినీ లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో వరదరాజపురం మలుపు వద్ద పిప్పర రోడ్డులోకి రావలసి ఉండగా అదుపుతప్పి ఎదురుగా ఉన్న చికెన్‌షాపులోకి దూసుకుపోయింది. అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొనడంతో ఆ స్తంభం సగానికి విరిగి లారీపై పడింది, అయితే అదృష్టవశాత్తూ విద్యుత్ ప్రమాదం జరుగలేదు. దీనితో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.